విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ఏఐటీయూసీ జిల్లా మహాసభలు వాయిదా

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : గుడివాడలో ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించినున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలు వాయిదా పడ్డాయని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ టి.తాతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడలో అక్టోబర్ 27, 28 తేదీలలో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, ఏఐటీయూసీ గుడివాడ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు జి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-గన్నవరం : స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం గన్నవరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ మహాసభ జరిగింది. ఈ మహాసభలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. రాష్ట డిప్యూటీ జనరల్ సెక్రటరీ యండి ప్రసాద్, జోనల్ సెక్రటరీ వైయస్‌రావు, రీజినల్ సెక్రటరీ వై వి రావు పరివేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. గన్నవరం డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా బి సంజీవరావు, కార్యదర్శిగా టి వి కొటేశ్వరరావు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి టి వి కొటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్‌ఆర్ యూనియన్ సభ్యులు ఎంప్లాయిస్ యూనియన్ చేరారు. అలాగే గన్నవరం డిపో నుండి 15 మంది వైయస్‌ఆర్ యూనియన్ నుండి ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మంచం పట్టిన పల్లెలు!

- రోగులతో ఆసుపత్రులు కిటకిట !
- వేధిస్తున్న సీజనల్ వ్యాధులు
- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం.
- కంటి తుడుపు చర్యగా చల్లుతున్న బ్లీచింగ్, సున్నాలు
- అల్లాడుతున్న ప్రజలు .. పట్టించుకోని అధికారులు

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో పారిశుధ్యం పడకేసి దోమలతో విషజ్వరాలు వ్యాప్తిచెంది పల్లెలు మంచం పట్టాయి... డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో రోడ్లపై వర్షను నీరునిలిచి కంపుకొడుతున్నాయి... రోడ్డు పక్కన చెత్తాచెదారాలు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయి... దీంతో ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరాల బారిన పడిన రోగులతో కిటకిటలాడుతున్నాయి. వీరిలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వర పీడితులు అధికంగా ఉన్నారు.

విశాలాంధ్ర-కూచిపూడి : ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలలో పారిశుధ్యం పడకేసి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గ్రామపంచాయతీలు గ్రామాలలో రహదారుల పక్కన బ్లీచింగ్ సున్నం చల్లించే పనిలో నిమగ్నమైనాయి. అదే సమయంలో గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్తాచెదారాలకి నిలయాలుగా మారి దుర్గంధం వెదజల్లే ప్రాంతాలు సైతం ఉన్నాయి.దీనితో గ్రామాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరాల బారిన పడిన రోగులతో కిటకిటలాడుతున్నాయి. వీరిలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరపీడితులు అధికంగా ఉన్నారు. వీళ్లంతా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించడంతో రోగులతో సందడిగా మారాయి. ఇదే సమయంలో ప్రభుత్వ వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు గ్రామాలలోసర్వేలకే పరిమితమైనారు. వ్యవసాయ తరుణం కావడంతో ఇంట్లోని వారంతా వరి నాట్లపనులకు వెల్తుండటంతోఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్. వెళ్లిన సమయానికి వివరాలు చెప్పడానికిఎవ్వరు అందుబాటులో ఉండటం లేదు. దీనితో సిబ్బంది ఇండ్లకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఇదే సమయంలోజరపీడుతులు దగ్గరలోనే ఉన్న ప్రైవేటు వైద్యశాలలకు, ప్రథమ చికిత్స కేంద్రాలకు తరలి వెళ్తున్నారు. మొవ్వ, నిడుమోలు పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాలకు గాని సబ్ సెంటర్లకు కానీ, జ్వర బాధితులు వెళ్లే అవకాశాలు లేక దగ్గరలో అందుబాటులో ఉన్న వైద్యుల దగ్గరికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. పీహెచ్ సి లు 24 గంటలు పనిచేస్తున్న దూర భారం అవటంతో పాటు రహదారులు సైతంతీవ్రగోతులతో ఇబ్బందికరంగా ఉండటంతో మారుమూల గ్రామాలలో సైతం ఎక్కడికక్కడ ప్రథమ చికిత్స కేంద్రాలు ను , ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూచిపూడి లోని సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో వివిధ రకాల జ్వర బాధితులు చేరి ఉచిత వైద్యాన్ని పొందుతున్నారు. ప్రభుత్వ వైద్య అధికారులు డెంగ్యూ లేదని, దానికి సంబంధించిన పరీక్షలు ప్రభుత్వ పరంగానే చేయించుకుంటే తేటతెల్లడవుతుందని, ప్రైవేట్ వైద్యశాలలో స్పష్టత రాదని పేర్కొంటున్నారు. అయినా ప్రతి ఒక్కరు ప్రైవేటు వైద్యశాలలకే చికిత్స నిమిత్తం తరలి వెళ్ళటం గమనార్హం!.వైద్య శాఖ సిబ్బంది కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండే వేళలైనఉదయం కానీ, సాయంత్రంపూట కానీ ఇళ్లకు వెళ్లి సర్వే చేసి జ్వరాల బాధితుల వివరాలు తీసుకొని సకాలంలో వైద్య సేవలు అందిస్తే రోగులకు ఆర్థిక పరమైన ఇబ్బందులు తొలగేఅవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.

కాలనీకి దారేది?

బురదమయంగా రహదారులు.. కాలనీల్లో కనీసవసతులు కరవు

విశాలాంధ్ర-అవనిగడ్డ : జగనన్న కాలనీకి రహదారి లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో ప్రతి నిరుపేదకు గృహం ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా నివేశిన స్థలాలను అందచేశారు. కానీ ఆ స్థలాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా సమకూర్చలేకపోయారు. అవనిగడ్డ నుండి పాత ఎడ్లంక వెళ్ళే రహదారి పక్కన మామిడి తోటల్లో 807 మంది లబ్దిదారులకు నివేశిన పట్టాలు అందచేశారు. నివేశిన స్థలాలు ఇచ్చిన వెంటనే గృహాలు నిర్మించుకోవాలని లబ్దిదారులకు సూచించినప్పటికి లబ్ధిదారులు పెద్దగా ఆశక్తి చూపలేదు. తదుపరి రెండవ పర్యాయంగా 350 గృహాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. సుమారు 250 మంది ముందుకు వచ్చి గృహ నిర్మాణాలు ప్రారంభించారు. వీటిలో సుమారుగా 50 గృహాలు పూర్తి కాగా కేవలం 15 కుటుంబాల వారు మాత్రమే నిర్మించిన గృహాల్లోకి ప్రవేశం చేసి అక్కడే నివాసం ఉంటున్నారు. లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొ లబ్దిదారునికి 1.80 లక్షలు మంజూరు చేయగా వాటికి తోడు మరో 10 లక్షలు అప్పు చేసి గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. గృహ నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రభుత్వం జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతులైన రహదారి, త్రాగునీరు,విద్యుత్ వంటివి ఏర్పాటు చేయలేకపోయింది. ఈ కాలనీలోనికి వెళ్ళే ప్రధాన రహదారిని సైతం ప్రభుత్వం విస్మరించడంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడి ఎన్నో వ్యవయప్రయాసలు కూర్చి గృహ నిర్మాణాలు చేసుకుంటున్నారు. 356 గృహాలు మంజూరు కాగా 250 గృహాలు పలు పలు దశలలో నిర్మాణాలు జరుగుతున్నాయి. మరో 100 మంది మాత్రం గృహ నిర్మాణం చేపట్టేందుకు ఆశక్తి చూపలేదు. ప్రభుత్వం కూడా ఆ దిశగా నిర్మాణాలు చేపట్టేందుకు అవగాహన కల్గించడం కానీ, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం కానీ జరగలేదు. నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలో మౌళిక వసతులపై శ్రద్ధ పెడుతుందో లేదో పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా పోలీస్ శిక్షణ కేంద్ర నిర్మాణం : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : పోలీస్ శిక్షణార్థం రాబోవు బ్యాచులకు ఉత్తమ శిక్షణ అందించడానికి త్వరితగతిన నూతన పోలీస్ శిక్షణ కేంద్రం నిర్మాణం జరగాలని, దానికి కావలసిన ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని గురువారం జిల్లా ఎస్పీ గంగాధరరావు పోలీస్ హౌసింగ్ ఇంజనీర్లతో నూతన పోలీస్ సైట్‌ను సందర్శించి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. శరవేగంగా నూతన పోలీస్ శిక్షణ కేంద్ర నిర్మాణం జరగాలన్నారు. నూతనంగా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని నిర్మించడానికి కావాల్సిన అనుమతులు భవన నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయడానికి సహకరించాలని, అలాగే పోలీస్‌శాఖ లోకి నూతనంగా ప్రవేశించబోయే పోలీస్ సిబ్బందికి శిక్షణ అందించడానికి అన్ని వసతులతో కూడిన శిక్షణ కేంద్రాన్ని సకాలంలో నిర్మించాలని, దాని కొరకు అందరం సమిష్టిగా కృషి చేయాలని, అందరి సహకారంతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ (అడ్మిన్) జి. వెంకటేశ్వర రావు, డిటిసి డిఎస్పీ రమేష్, పోలీస్ హౌసింగ్ బోర్డు డిఈఈ శ్రీనివాస్, సిఐ సోమేశ్వరరావు, హౌసింగ్ బోర్డు అసిస్టెంట్ ఇంజనీర్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులతో సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. విద్యార్థులలో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందింప చేయడానికి ఈ వేడుకలుస్ఫూర్తినిస్తాయని కూచిపూడి లోనిశ్రీసిద్దేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ హై స్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్ పేర్కొన్నారు. నృత్య, నాటికల ప్రదర్శన, గీతాలాపనలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించారు.

సీనినటుడు కైకాల జయంతి

విశాలాంధ్ర-గుడివాడ : నవరస నట సార్వభౌముడు కైకాల సత్యనారాయణ జయంతి వేడుకలను కాపు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ సెంటర్లోని కైకాల విగ్రహానికి సేవా సమితి, కళాకారులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సినీ, కళా రంగానికి చిరస్మరణీయమైన సేవలు అందించిన కైకాలకు పద్మశ్రీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, కళాకారుల సంఘ పెద్దలు నెరుసు చింతయ్య, కాపు సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : గన్నవరం విమనాశ్రయ విస్తరణలో భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి గన్నవరంలో విమానాశ్రమ విస్తరణలో సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపుల పెండింగ్, సీ ఆర్‌డిఏ ప్లాట్ల కేటాయింపులో సమస్యలు సమీక్షించారు. విమానాశ్రయ విస్తరణ లేఔట్ మ్యాప్ కలెక్టర్ డికె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ పరిశీలించారు. విమానాశ్రయ విస్తరణలో గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న నిర్ణయాలపై అధికారులు తీసుకున్న చర్యలు సమగ్రంగా సమీక్షించారు. రైతులకు చెల్లించవలసిన నష్టపరిహారం పెండింగ్ సమస్యలు, వార్షిక కౌలు చెల్లింపు సమస్యలు, సిఆర్‌డిఏ ప్లాట్ల కేటాయింపు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఉన్నత అధికారులకు అవసరమైన లేఖలు పంపాలన్నారు. భూసేకరణ చెల్లింపుల తాజా స్థితిపై నివేదిక సమర్పించాలని అన్నారు. విమానాశ్రయం ప్రహరీ లోపల విద్యుత్ స్తంభాల తొలగింపు పూర్తయిందన్నారు. విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి నిర్మాణాల వల్ల భద్రతా సమస్యలు రాకుండా చూడాలని, విమానాశ్రయ సరిహద్దు వెంబడి కొందరు రైతులు పొలాలు సాగుచేస్తున్నారని, తద్వారా పక్షులు రన్‌వే పైకి రావడం వల్ల విమాన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని విమానాశ్రయ అధికారులు గత సమావేశంలో తెలిపారు. వీటిపై వెరిఫికేషన్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ కె. చంద్రశేఖర రావు, గుడివాడ ఆర్డీఓ పద్మావతి, గన్నవరం తహసీల్దార్ పవన్, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ తేజేశ్వర రావు, విద్యుత్ శాఖ ఈఈ భాస్కర రావు, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణపై అర్కిటెక్చర్ బృందం పర్యటన

విశాలాంధ్ర-గుడివాడ : విజయవాడకు చెందిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆహ్వానం మేరకు గుడివాడ పట్టణంలో గురువారం పర్యటించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రామబ్రహ్మం పార్క్, పురపాలక సంఘ కార్యాలయ సెంటర్, తదితర ప్రాంతాల్లో, మున్సిపల్ అధికారులతో నిపుణుల బృందం పర్యటించారు. అనంతరం పురపాలక సంఘ భవనాలు, నాగవరప్పాడు నుండి బస్టాండ్ సెంటర్ వరకు ఉన్న సెంట్రల్ డివైడర్‌పై నిపుణుల బృంద సభ్యులు సర్వే నిర్వహించారు. అనంతరం పట్టణ సుందరీకరణకు తీసుకోవలసిన చర్యలపై బృంద సభ్యులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బాలసుబ్రమణ్యంకు టౌన్ మ్యాప్ ద్వారా వివరించారు. ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం పర్యటన వివరాలను మున్సిపల్ ఇంజనిర్ బి.విజయదుర్గ విలేకర్లుతో మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీసుకుంటున్న చర్యలలో భాగంగా నిపుణుల బృందం పట్టణంలో పర్యటించిందన్నారు. పట్టణ సుందరీకరణ, గ్రీనరీపై బృంద సభ్యులు పలు ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న చింతల కాలువ డ్రెన్‌పై కవర్స్ స్లాబ్‌లను ఏర్పాటు చేసి, అక్కడ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు, స్వతంత్ర సమరయోధుల విగ్రహాల ఏర్పాటుకు బృంద సభ్యులు పూర్తిస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. నిపుణుల బృంద సభ్యులు అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, నిధుల విడుదలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత పెద్దు శ్రీకాంత్, డి.ఈ ప్రవీణ్, ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు సమస్యల పరిష్కారానికి పోరాటం

విశాలాంధ్ర-కూచిపూడి : వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కౌలు రైతు చట్టాన్ని రద్దుచేసి 2011 సంవత్సరం లోని భూ రైతుల చట్టాన్ని అమలు చేయాలని గురువారం మండలం పెడసనగల్లులో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ ఆధ్వర్యంలో సంతకాల ఉద్యమం కొనసాగింది. మొవ్వ మండలంలో ఇటీవల గ్రామాలకువెళ్లి సంతకాల సేకరణ చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామంలో నిర్వహించారు. భూయజమానులసంతకంతో సంబంధం లేకుండాగ్రామ రెవెన్యూ అధికారులు కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు చోడాబత్తిన వెంకటేశ్వర రావు, చోడాబత్తిన నాంచారయ్య,, కృష్ణారావు, మేరుగు విష్ణు, మద్దులప్రవీణ్, కటికలఅనిల్, చిగురుపల్లిసుబ్రహ్మణ్యం, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : వృద్ధులకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని పాత ఎడ్లంక ఫైత్ హోమ్ చర్చిలో గురువారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. వర్షాకాలం, శీతాకాలం దృష్టిలో పెట్టుకుని చలికి తట్టుకునేందుకు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విలియం కేరి, ఎబి నేజ, ఆదాం, బాబూరావు, కొండలు తో పాటు పలువురు పాల్గోన్నారు.

వరిపైరులో కలుపు నివారణకు సస్యరక్షణ చర్యలు

విశాలాంధ్ర-పమిడిముక్కల : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలైందని రైతులు నాట్లు వేసే ప్రక్రియ లో నిమగ్నమైయ్యారని నాటు వేసిన మూడు లేదా ఐదు రోజుల లో కలుపు మందు చల్లి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని "ఆత్మ" ఎడిఏ శ్రీనివాస్ తెలిపారు. గురువారం గురజాడ రైతు సేవా కేంద్రం నందు వ్యవసాయ సాంకేతిక సంస్థ "ఆత్మ" వారి ద్వారా రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా సంస్థ, ఉయ్యూరు కీటకశాస్త్ర విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ నారుమళ్ళు యాజమాన్య పద్ధతులు ఎరువులు వాడకం పై అవగాహన కల్పించారు.ఎడిఏ శ్రీనివాస్ మాట్లాడుతూ నాటు వేసిన తరువాత మూడు లేదా ఐదు రోజుల లోపు పోలానికి కౌన్సిల్ యాక్టీవా కలుపు మందు ఇరవై కేజీ ల ఇసుకలో కలిపి చల్లుకోవాలని,అలాగే పదిహేను నుంచి ఇరవై రోజుల పైరుకైతే బిస్పైరిన్ బాక్ సోడియం నామినీ గోల్డ్ మందుని ఎకరానికి వంద గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.గణేష్ రెడ్డి,ఆత్మ వ్యవసాయాధికారి పద్మజ, వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినీల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్. : బాల్య మరియు కౌమార దశలో ఉన్న విద్యార్థినిలు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ లపై అవగాహన కలిగి ఉండాలని సఖి వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ అర్చిష్మ అన్నారు. స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ కృష్ణా జిల్లా వారి ఆధ్వర్యంలో మిషన్ శక్తి స్కీం 100 రోజుల అవగాహన కార్యక్రమాలలో భాగంగా గురువారం బలరాముని పేట గాంధీ విద్యాలయంలోని విద్యార్థిని విద్యార్థులకు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఋతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత గురించి ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, నేటి సమాజంలో ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే వారిని ఆకర్షితులను చేసుకోవడానికి పలు రకాల ప్రలోభాలకు గురి చేస్తూ యువతను చెడు దారి పట్టిస్తున్న వారిని ఆదిలోనే గుర్తించి వారి ప్రవర్తన పై టీచర్లకు ఫిర్యాదు చేయాలని, అలా కాని పక్షంలో హెల్ప్ లైన్ నెంబర్స్ 1098,181,100,112 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీ విద్యాలయం హెచ్ఎం భవాని, ఓ ఎస్ సి సిబ్బంది సుధారాణి, శిరీష, ఐసిపిఎస్ సిబ్బంది కిషోర్, ఐసిడిఎస్ ఉద్యోగులు, అంగన్వాడీ టీచర్స్, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవారు దర్శనం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మేదర్ బజార్‌లోని గంగానమ్మ వీధిలోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో గురువారం శాఖంబరి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కాయగూరలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో శ్రీ శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఉత్సవ పిటలపై భక్తులు కూర్చొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏటా దేవస్థానంలో శాకాంబరి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని భక్తులు తెలిపారు. వేడుకల్లో భక్తులు, పాల్గొన్నారు.

IN THE COURT OF V TH ADDL. JUNOIR CIVIL JUDGE, AT VIJAYAWADA
E.P NO:369/2023
In O.S No: 937/2020
Between :-
కోనేరు సరోజనీ............డి.హెచ్.ఆర్
మరియు
రామిశెట్టి కాళిదాసు........జె.డి.ఆర్
టు,
రామిశెట్టి కాళిదాసు,తండ్రి వీరశంకరరావు, హిందు వయస్సు 38సం॥,ఎంప్లాయి ఆఫ్ స్వీటి హైట్స్ వాచ్ మెన్, కామినేని హాస్పటల్ ఎదుట, సాయిబాబాగుడి ప్రక్కన, తాడిగడప రోడ్డు, ఆటోనగర్, విజయవాడ
...... జె.డి.ఆర్
పై నెంబరు ఇ.పి పిటీషన్‌ను, పిటీషనర్ పై కోర్టులో ఫైల్ చేయగా దానిలో జె.డి.ఆర్ అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా త్రిప్పి పంపిన కారణంగా మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.05-08-2024న వాయిదా వేసినారు. సదరు తేదిన ఉదయం గం॥ 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ, మీ తరుపున న్యాయవాది ద్వారా గాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను.లేనియెడల మీ వరోక్షంగా తీర్మానం చేయుగలరని తెలియజేయడమైనది.
(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 05-08-2024
ఇట్లు:-
ఐ.ప్రణవ ప్రకాష్,న్యాయవాది,
కస్పావారి వీధి, గవర్నరు పేట
విజయవాడ-2. ఫోన్:9246478897

మురుగు డ్రైయిన్‌ల పూడికతీయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : మండల పరిధిలోని వేకనూరులో ఉన్న రెండు మెయిన్ డ్రెయిన్‌లో పూడిక తీత పనులు నిర్వహించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సబ్ డివిజన్ చల్లపల్లి వారికి వేకనూరు ఉపసర్పంచ్ తుంగల మురళీ వినతి పత్రం అందచేశారు. గురువారం అందచేసిన వినతి పత్రంలో గ్రామంలోని 5 వ నెంబర్ కాలువ పక్కన గల వీరన్న అలుగు (డ్రెయిన్) అవనిగడ్డ నుండి నాగాయలంక వెళ్ళు కెఈబి కెనాల్ దగ్గర నుండి పెదగుడుమోటు దగ్గర రత్నకోడు వరకు ఉన్న మరియు 3వ నెంబర్ కాలువ పక్కన గల డ్రెయిన్, అవనిగడ్డ నుండి నాగాయలంక వెళ్ళే కెఈబి కెనాల్ దగ్గర నుండి బందలాయిచెరువు నుండి పోటుమీద వరకు వెళ్ళే రోడ్డు వరకు ఉన్న ఈ రెండు డ్రైయిన్‌లు పూర్తిగా పూడుకుపోయాయని పూడిక తీసి చాలా సంవత్సరాలు అయ్యిందని అధికారులు దృష్టి పెట్టి రైతులు నష్టపోకుండా డ్రెయిన్‌లు అభివృద్ధి చేయాలని కోరారు.

ఎస్సీఆర్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా పద్మజ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎమ్)గా కె.పద్మజ (ఐఆర్‌టిఎస్) రైలు నిలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1991 బ్యాచ్‌కి చెందిన వారు. దక్షిణ మధ్య రైల్వేలో మొదటి మహిళా పిసిసిఎమ్‌గా నిలిచారు. సైన్స్,విద్యలో బ్యాచిలర్ డిగ్రీని కలిగి ఉన్నారు. ఇంతకు ముందు ఎస్సీఆర్‌లో చీఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్ మేనేజర్‌గా ని చేస్తు బదిలిపై ఇక్కడకు వచ్చారు.భారతీయ రైల్వేలో 30 సంవత్సరాలకు పైగా విశిష్టమైన తన కెరీర్‌లో హైదరాబాద్ డివిజన్‌లో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ (ఎసిఎమ్) వంటి అనేక ఇతర కీలక పదవులను నిర్వహించారు.అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఎటిఎమ్),డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (బొగ్గు-వస్తువులు) సికింద్రాబాద్ డివిజన్‌బీ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, గుంతకల్ డివిజన్ డివై చీఫ్ కమర్షియల్ మేనేజర్, ఇఆర్‌ఎస్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్,సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పని చేశారు.సలహాదారు (రవాణా)/ గోదావరి ఫెర్టిలైజర్స్ కంపెనీ లిమిటెడ్,జనరల్ మేనేజర్,గా కూడా పనిచేశారు.ఎస్సీఆర్ ఆఫీసర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా కుడా కొనసాగుతున్నారు.

కొండలమ్మ హుండీ ఆదాయం రూ.27 లక్షలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీలను గురువారం ఉదయం మచిలీపట్నం తనిఖీ అధికారి కగ్గా శ్రీనివాసరావు, శ్రీ అమ్మ వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు, వేమవరం సర్పంచ్ శ్రీమతి మన్నెం పద్మావతి, వేమవరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లా అంకాలరావు, మన్నెం నరసింహమూర్తి మరియు గుడ్లవల్లేరు పోలీసు సిబ్బంది సమక్షమున తెరిచి లెక్కించగా మొత్తం 60 రోజులకు గాను నోట్లు ద్వారా 25,91,890 రూపాయలు మరియు చిల్లర ద్వారా 1,28,041 రూపాయలు వెరసి మొత్తము రూ.27,19,931రూపాయలు వచ్చియున్నదని ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. సదరు హుండీ లెక్కింపు కార్యక్రమములో ఇండియన్ బ్యాంకు సిబ్బంది , సేవా సమితి వారు మరియు దేవస్థాన సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

చిల్లలవాగులో గుర్రపుడెక్క తొలగింపు

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డ వద్ద చిల్లలవాగులో గుర్రపుడెక్క తొలగింపు పనులు జరిగాయి. డ్రైనేజీ శాఖ ఇన్చార్జి డీఈఈ పి. వెంకటే శ్వరరావు పర్యవేక్షణలో పనులు చేపట్టారు. చిల్లలవాగులో తూటికాడ, గుర్రపుడెక్క తొలగించేందుకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో నిధులు విడుదల కాగా, జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ కృషితో షార్ట్ టెండరు పద్ధతిలో పనులు చేపట్టారు. దీంతో కొన్నిచోట్ల కూలీలు, యంత్రాల సహాయంతో గుర్రపుడెక్క తొలగింపు, మరికొన్ని చోట్ల స్ప్రేయింగ్ పనులు చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచనలతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా పనులు చేస్తామని డీఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి 12.30 నిమిషాల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు, తమ ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలు ఫోన్ నెం 9959225466 కు తెలియచేయాలన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ధనస్వామ్యానికి ప్రజలు పట్టం

సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ నగరం, ఎన్టీఆర్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలం పెరిగే ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ బలోపేతం అవుతుందని దానికి నగరం నాంది పలకాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కష్టజీవుల పక్షాన నిలుస్తుందన్నారు. సీపీఐ జిల్లా సమితి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చుండూరి వెంకట సుబ్బారావు అధ్యక్షతన గురువారం స్థానిక దాసరి భవన్ అ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా ప్రతిచోట శాఖ సభలు జరపాలని సూచించారు. శాఖ వద్ద నుంచే పార్టీ ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ఇటీవల జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన బాయిలర్ ప్రమాదంలో నలుగురు కార్మికులు మృతి చెందారని వారిని సంతాపం తెలియజేస్తూ బూదవాడ గ్రామంలో బహిరంగ సభ పెట్టటం జరిగిందన్నారు. బాధితులకు నష్ట పరిహారం ఇప్పించేందుకు సీపీఐ పోరాటం చేసిందన్నారు. జిల్లా కలెక్టర్ జి.సృజన చొరవతో బాధిత కుటుంబానికి రూ.50లక్షలు పరిహారం చెల్లించటం జరిగిందన్నారు. కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మిక చట్టాలు అమలు కావటం లేదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులే కాంట్రాక్టులుగా ఉండి కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బూదవాడలో బాలాజీ నాయక్ సారధ్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పరిటాల క్వారీ, ఎన్టీపీసీలో జరిగిన ప్రమాదాలపై కూడా బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు సీపీఐ అండగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో సీపీఐ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలను వివరిస్తూ అల్ట్రాటెక్ ర్యాంకో కంపెనీలలో పారిశ్రామిక చట్టాలు అమలు చేయాలని, కాలుష్య నివారణ , భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29వ తేదిన జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. జూలై 30వ తేదిన పరిటాల క్వారీ ఘటనలపై పరిశీలన ఉంటుందన్నారు. ఆగస్టు ఒకటవ తేదిన ఇబ్రహీంపట్నం పీపీఎస్ఎస్ ప్రెస్‌క్లబ్ పరిసర గ్రామాల్లో సదస్సు ఉంటుందన్నారు. ఆగస్టు 21, 22, 23 తేదిలలో ఏ.కొండూరు, గంపలగూడెం కిడ్నీ సమస్య పరిష్కారం కోసం 'ప్రజా ఆరోగ్య పరిరక్షణ యాత్ర' నిర్వహించిన విజయవాడలో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. చింతల పూడి, వేదాద్రి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, కట్టలేరు బ్రిడ్జి నిర్మాణంపై కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, వల్లంకొండ బ్రహ్మం, పరుచూరి రాజేంద్రబాబు పాల్గొన్నారు. ఈ సమావేశానికి గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్‌ల శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘా బాధ్యులు హాజరైయ్యారు. ముందుగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య విప్లవ గీతాలు ఆలపించారు.

మేయర్‌ను కలిసిన కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన హెచ్.ఎం. ధ్యానచంద్ర అనంతరం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిని కలిశారు. మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి కమిషనర్ ధ్యానచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

అన్న క్యాంటీన్లలో వసతులకు చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో ఏర్పాటు చేస్తోన్న అన్న క్యాంటీన్లలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో భాగంగా సర్కిల్-2 పరిదిలోని ధర్నాచౌక్ పక్కన ఉన్న అన్నా క్యాంటీన్‌ను గురువారం పరిశీలించారు. క్యాంటీన్‌లో అన్ని వసతులు కలిగి ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని, ఫ్లోరింగ్ నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసి ప్రజలకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అన్న క్యాంటీన్ ఆవరణలో పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్-2 ప్రభుదాస్, ఈఈ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి, ప్రజల సంతృప్తి, యోగక్షేమాలే లక్ష్యం : కమిషనర్ ధ్యానచంద్ర

నగర అభివృద్ధితో పాటు ప్రజల సంతృప్తి, యోగక్షేమాలే లక్ష్యంగా కృషి చేస్తానని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర పేర్కొన్నారు. విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా హెచ్.ఎం.ధ్యానచంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు కమిషనర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న 64 వార్డుల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ నిర్వహణలో జాతీయ ప్రమాణాలతో మెరుగుపడేందుకు సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ప్రజలకు కేవలం సురక్షితమైన త్రాగునీటినే అందించేందుకు చర్యలు తీసుకుంటామని, సైడ్ డ్రెయిన్లలో త్రాగునీటి పైప్ లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటూ కలుషిత నీటికి తావులేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వస్తున్న ప్రాజెక్టులను కూడా సంపూర్ణంగా అమలు చేసే దిశగా నగరపాలక సంస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గ్యాస్ లారీ ఢీకొన్న కారు

ఒకరు మృతి మరొకరికి గాయాలు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : భద్రాచలం జాతీయ రహదారిపై కొండపల్లి ఐడియా సమీపంలో గ్యాస్ బండ లారీని స్కార్పియో వాహనం వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డ సంఘటన గురువారం జరిగింది. విజయవాడ పట్టణంలో చెందిన చెన్నుపాటి సాంబశివరావు (58) గుమస్తాతో కలిసి స్కార్పియో వాహనంలో మైలవరం వైపు వెళుండగా గ్యాస్ బండ లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంలో ఇరుక్కుపోయిన సాంబశివరావును స్థానికులు డోర్లు పగలగొట్టి ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో ఆయన మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి తోటలో నేపాల్ వ్యక్తి అస్తిపంజరం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి పంచాయతీ పరిధిలో గల మామిడి తోటలో నేపాల్ దేశస్థుడు అస్తిపంజరాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. నేపాల్ దేశం నకు చెందిన కృష్ణమోహన్ కుమార్(46) కోయంబత్తూరు సోనాలి అల్యూమినియం ఫ్యాక్టరీలో గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఏడాది ఏప్రిల్ 24వ తేదీన నేపాల్ వెళ్లి తిరిగి స్నేహితులైన రాజ్ కుమార్ కంచన్ కుమార్ సంజన కుమార్ లతో కలిసి కోయంబత్తూర్ వెళుతుండగా మార్గమధ్యంలో విజయవాడ రైల్వే స్టేషన్ లో దిగాడు. అక్కడ ట్రైన్ మిస్ అయి మే నెల 25వ తేదీన స్నేహితులకు ఫోన్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయిపోయింది. మామిడి తోటలో అస్తిపంజరం వద్ద ఫోన్ లభించటంతో పోలీసులు విచారణ చేసి సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించారు. మామిడి తోట యజమాని బసవపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పునఃప్రారంభించాలి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని పున:ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం సాయికుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక దాసర భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అందజేసే విధంగా ఎన్డీఏ కూటమి ఆలోచించాలని. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల చదువుతున్న విద్యార్థులు అందరూ పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి చదువుకుంటున్నారు చెప్పారు. వారికి ఉచిత విద్యతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష ,కార్యదర్శులు రంజిత్ జగదీష్ నాయకులు సుధీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ సైలెన్సర్లు ధ్వంసం

- రోడ్డు రోలర్స్‌తో 297 సైలెన్సర్లు తొక్కించిన పోలీసులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఎక్కువ సౌండ్ వచ్చేలా బైక్‌లకు బిగించుకున్న సైలెన్సర్లను విజయవాడ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు రోలర్‌తో తొక్కించారు. గురువారం నున్న మ్యాంగో మార్కెట్ వద్ద 297 సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి మాట్లాడుతూ వాహనాలకు అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఇబ్బంది కలిగించే వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. బైక్‌లు కొనుగోలు చేసినప్పుడు వచ్చే సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని అన్నారు. కౌన్సిలింగ్ ఇచ్చిన మార్పు కనిపించకపోవడంతో ఈ ఏడాది మే నుంచి జులై వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్డు రోలర్ సైలెన్సర్లను తొక్కించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీపీఎస్ పబ్లిక్ స్కూల్ శిక్షా సప్తాహం

విశాలాంధ్ర-విజయవాడ: వీపీఎస్ పబ్లిక్ స్కూల్‌లో శిక్షా సప్తాహ్ విద్యా వేడుకలు ఎంతో ఉత్సాహంతో జరిగాయి. ఈ నెల 22న ప్రారంభమైన వారం పాటు సాగుతున్న ఈ వేడుకల్లో విద్య ప్రాముఖ్యతను గుర్తించి, ప్రోత్సహించడం, ఉపాధ్యాయులు, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ-విద్యార్థులకు విద్యాసంబంధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా దినోత్సవంతో సహా అనేక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 500 మంది విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొని తమ ప్రతిభను, నైపుణ్యాలను ప్రదర్శించారు. పాఠశాల కొత్త లైబ్రరీ సైన్స్ లాబొరేటరీని ప్రారంభించింది. మ్యాగజైన్, వార్తాలేఖను ప్రారంభించింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కె. రోజ్ మేరీ ప్రధానోపాధ్యాయురాలు తమ విలువైన ప్రసంగాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని కల్చరల్ కమిటీ హెడ్ ఎం. ప్రసన్న కవిత బృందం నిర్వహించి సమన్వయం చేశారు. 'శిక్షా సప్తాహ వేడుకలు అఖండ విజయాన్ని సాధించాయి. తాము విద్యలో నైపుణ్యం కోసం ప్రయత్నిస్తూనే ఉంటామని, తమ విద్యార్థులను వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి శక్తివంతం చేస్తామన్నారు.

వీఎంసీ భవన నిర్మాణంలో అవినీతి

మేయర్ రాజీనామా చేయాలి : బాలస్వామి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ నూతన కార్యాలయ నిర్మాణంలో పెద్ద ఎత్తన అవినీతి జరిగిందని, ఇందులో ప్రదాన సూత్ర దారులు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులేనని కార్పొరేషన్‌లో టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలబండ్ల బాలస్వామి అన్నారు. టీడీపీ కార్పొరేటర్లు బాలస్వామితో పాటు చెన్నుపాటి ఉషారాణి, బీజేపీ కార్పొరేటర్ బుల్లా విజయకుమార్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు వీఎంసీ నూతన నిర్మాణాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలస్వామి విలేఖర్లుతో మాట్లాడారు. అవినీతితో ప్రజల ధనాన్ని కొట్టేసిన వైసీపీకి చెందిన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వెలంపల్లి నూతన భవనంలోని రెండవ అంతస్తు నిర్మాణంలో రెండు కోట్లు రూపాయిలు కొట్టేశారని ఆరోపించారు. కార్పొరేషన్‌లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఓ పథకం ప్రకారం పాత కాంట్రాక్టర్‌ను తొలిగించి మేయర్‌కు సంబందించిన ఒక కాంట్రాక్టర్, వెలంపల్లి శ్రీనివాసరావుకు సంబందించిన ఒక కాంట్రాక్టర్ మాత్రమే టెండర్లులో పాల్గొని టెండర్లు దక్కించుకున్నారన్నారు. నిర్మాణంలో నాసిరకం టైల్స్, అద్దాలు ఇతర మెటీరియల్ మొత్తం నాసిరకం వాడి మేయర్, మాజీ ఎమ్మెల్యే సొమ్ముచేసుకున్నారన్నారు. రెండవ ఫ్లోర్‌కు వెళ్లేందుకు కనీసం లిఫ్టుకూడా నిర్మించలేదన్నారు. ఈ నిర్మాణంలో జరిగిన అవినీతిని ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామమోహన్, ఎంపీ కేశినేని చిన్నీ దృష్టికి తీసుకువెళ్లి దర్యాప్తు చేయాలని కోరతామని తెలిపారు. మేయర్, మాజీ ఎమ్మెల్యే దిగమించిన ప్రజా ధనాన్ని కక్కిస్తామని తెలిపారు. మేయర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇక నుంచి జరిగే పనుల్లో నాణ్యతతో నిర్మించేలా చూడాలని అధికారులను కోరారు.

ఎన్నికలపై రాష్ట్రపతికి పిర్యాదు చేస్తా...

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సార్వత్రిక ఎన్నికలలో విజయవాడ పార్లమెంట్‌కు థర్డ్ ఫ్రంట్ స్వతంత్ర అభ్యర్థిగా తనకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకు వెళుతున్నట్లు దేవరపల్లి మల్లిఖార్జున రావు (మహేష్) తెలిపారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు వ్యవస్థలు తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ పార్లమెంట్ ఎన్నికలు నాతో సహా ఓటరులందరిని గందరగోళం పరిచాయని అందుకు కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) తనకు కేటాయించిన సీరియల్ నెంబర్‌లో నోటా పేరుని ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ విషయమై పోలింగ్ ముందు 10/05/2024న రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అదే నెల 24న మరొకసారి ఫిర్యాదు చేయటంతో 30న విజయవాడ పోలీస్ కమిషనర్ ఏర్పాటు చేసిన కాండిటెడ్స్ మీటింగ్ లో కౌంటింగ్ తదనంతరం జరగబోయే పరిణామాలపై ఎవరికైన సమాచారముంటే స్వయంగా తన దగ్గరకు వచ్చి తెలియజేయవచ్చు అని చెప్పడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రిటర్నింగ్ అధికారి కలెక్టర్ కార్యాలయము నుండి 31/05/2024 కేశినేని శ్రీనివాస్ కి నోటీసు పంపగా కౌటింగ్ అయిపోయి ఫలితాలు వచ్చిన తర్వాత జూన్ 7న ఆ నోటీసుకి సమాధానం పంచారన్నారు. మరికొద్ది రోజులకే ప్రత్యక్ష రాజకీయాల నుంచి తాను తప్పుకుంటున్నట్లు కేశినేని శ్రీనివాస్ ప్రకటించారన్నారు. తాను చేసిన ఫిర్యాదుపై తెలుసుకునేందుకు కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్నా జూన్ 13న తనకు సమాధానం కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చారన్నారు.ఇచ్చిన కొద్ది రోజులకే కలెక్టర్,సిపి బదిలీ అయ్యి వెళ్లిపోయారు తనకు జరిగిన అన్యాయంఐ త్వరలో రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం చేయమని కోరతామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు కె. వి. ఆర్ హైస్కూల్ నందు సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గయ్యపేట సర్కిల్ సిఐ జానకిరామ్ హాజరైనారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా స్పందించకూడదని,సైబర్ నేరాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 అందరూ తెలుసుకోవాలని ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ ఉపయోగించే వారు తెలియని లింక్స్ ఓపెన్ చేయకూడదు అని,ఆధార్ నంబర్ దానికి సంబంధించిన ఓ టి పి నంబర్స్ ఎవరకి చెప్పకూడదు అని సి. ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎస్.ఐ. పి.రాంబాబు.పాఠశాల ప్రిన్సిపాల్ ,కె. జలజ, ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కర్మాచారి సంఘం అధ్యక్షుడిగా దావీదు రాజు

విశాలాంధ్ర-విజయవాడ: రెల్లి కుల సఫాయి కర్మాచారి సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడుగా యర్రంశెట్టి దావీదు రాజు ఎన్నికైనట్లు జాతీయ ఎస్సీ రెల్లి గ్రూపు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడుగుల నాగశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రెల్లి పారిశుధ్య కార్మికుల సమావేశం విజయవాడ జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగిందన్నారు.

నూతన కార్యవర్గం: అధ్యక్షుడు దావీదు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వెంకట్, ఉపాధ్యక్షుడు ఎం.దీలీప్, ప్రధాన కార్యదర్శి తుపాకుల ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు యర్రంశెట్టి సామ్యూల్ రాజు, బౌరిశెట్టి అర్జున, కార్యవర్గ సభ్యులు శీరంశెట్టి దామోదర్, శీరంశెట్టి వరాలమ్మ, యర్రంశెట్టి సురేష్, ఇంటి సురేష్, బంగారు శ్రీను ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషిచేయాలి

విశాలాంధ్ర-కంచికచర్ల: డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కంచికచర్ల ఇన్‌స్పెక్టర్ బి.సత్య నారాయణ సూచించారు. కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని ఎం వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ ఈ బీ అడిషనల్ సూపరింటెండెంట్ కె.వి రామకృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్స్ 100 రోజుల కార్య క్రమం లో భాగంగా డ్రగ్స్ నుండి యువతను,విద్యార్థులను చైతన్య పరిచేందుకు గురువారం మారక ద్రవ్యాల దుష్ఫలితా లపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ బి సత్యనారా యణ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు.రాష్ట్రం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టేందు కు ప్రతి ఒక్కరు సహకరించాల ని కోరారు.యువత డ్రగ్స్ మోజులో పడి తమ భవితను నాశనం చేసుకుంటు న్నారని,అటువంటి వారిలో చైతన్యం నింపేందుకు తల్లిదండ్రులతోపాటు అధ్యాపకులు సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు.ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకు లతో యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో యాంటీ డ్రగ్స్ ను తెలియజేసే హోర్డింగ్స్ ను కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యు.ఏడుకొండలు, ఏవో ఎం.శివరామకృష్ణ,వైస్ ప్రిన్సి పాల్ సురేష్ బాబు,ఎస్ ఈ బి ఎస్ఐ ఎన్.కళ్యాణి,వై నాగేంద్రకృష్ణ లు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

విశాలాంధ్ర-తిరువూరు : జిల్లా బార్ ఫెడరేషన్ వారి పిలుపుమేరకు భారత న్యాయ శిక్షాస్మృతిలోని బి ఎన్ ఎస్ ఎస్, బిఎస్ఎస్ సెక్షన్లను కొత్త సెక్షన్లుగా అమలులోకి తీసుకువచ్చిన సందర్భంగా నూతన చట్టాలను నిలుపుదల చేయాలని తిరువూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధుల బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు వాకధాని లక్ష్మీనారాయణ, షేక్. గౌసుద్దీన్ అధ్యక్షతన సంకురాత్రి జనార్దన్ రావు , బిఎల్ గణేష్ సింగ్ , ఎం రామ మోహన్ రాజు, రేగళ్ళ మోహన్ రెడ్డి, మేకల నాగేంద్ర ప్రసాద్, అత్తులూరి శ్రీనివాసరావు, భాస్కర్ రావు, కొత్తపల్లి ఆనంద్ స్వరూప్, ఏ అంజన్ రెడ్డి, మేకలరవి, సిహెచ్ రాజేంద్ర బాబు,నల్లపాటి సుబ్బారాయుడు, రావూరి నాగరాజు , జి భాస్కర రావు,కనపర్తి రాంబాబు,పినపాటి నరసయ్య,భూక్య రామారావు, సునీల్ బార్ అసోసియేషన్ వారు పాల్గొన్నారు.

మరమ్మతుల రీత్యా కరెంటు నిలిపివేత

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలం కీసర సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తు ల రీత్య విద్యుత్ సరఫరా నిలిపివేత.కంచికచర్ల మండలం కీసర గ్రామ సబ్ స్టేషన్ లోని బ్రేకర్ల మార్పు చేయటం వలన రేపు ఉదయం అనగా శుక్రవారం ఉదయం 09.00 గంటల నుండి సాయంత్రం 03.00 గంటల వరకు కీసర సబ్ స్టేషన్ పరిధిలోని గండేపల్లి కీసర పెండ్యాల వేములపల్లి అమర వరం గ్రామాల లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడును.కావున ప్రజల సహకరించవలసిందిగా విద్యుత్ శాఖ ఏఈ ఎలమంచిలి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

NRI INSTITUTE OF TECHNOLOGY

Approved by AICTE & Affiliated to JNTUK, KAKINADA

Best Industry connect Autonomous Institute with NAAC (A) & NBA

Agiripalli (M), Krishna (Dt), A.P.,Ph : 9391878787, 9390686868, 9394686868

email : nrihitech@rediffmail.com

B.Tech Admission Notification 2024-2025

NRI Quota seats under Category - B

Applications for admission into 1st year B.Tech in the following courses **NRI QUOTA SEATS** under **category "B"** for the academic year 2024-25 shall be obtained from office or may be downloaded from the college website **www.nriit.edu.in**

COURSE	CSE	CSE-TM	CSE-AI	AI	DS	IT	ECE	EEE	CIVIL	MECH
INTAKE	360	60	180	120	180	120	180	60	30	30
NRI QUOTA SEATS	54	9	27	18	27	18	27	9	4	4

Filled in applications along with photostat copies of relevant certificates and registration fee of Rs. 1,000/- in cash or by DD in favour of Chairman, NRI Institute of Technology shall be submitted in the office from **25/07/2024** to **27/07/2024** at **4.00** P.M. The eligibility and admission will be as per government orders in force

Tuition Fee : US $ 5,000/- (US Dollars)

Date : 25/07/2024 Dr. R. VENKATA RAO, Chairman

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA

ACP No.193 of 2022

BETWEEN:

Vastava Chit Fund Pvt Limited Vijayawada, Rep by it's Managing Director Tummala Venkata Rao, Son of Satyanarayana **- DISPUTANT**

And

Singareddy Manoj Reddy and others - OPPONENTS

To,

1. Singareddy Manoj Reddy, Son of Ramana Reddy, Resident of Himadurga Motor Car Shead, BY Pass Road, Gollapudi, Vijayawada. **(Opponents No.1)**

Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **27-07-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on **27-07-2024 at 10-30 A.M.** in person, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)

A Prasoon Kumar, Advocate, D.No.27-17-5 Peddibhotla Vari Street Governorpet, Vijayawada-2

Date of Adjourment: 27-07-2024

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA

ACP No.71 of 2023

BETWEEN:

Pavitra Chit Fund Pvt Limited Rep by it's Foreman and Managing Director Ch. Nageswara Rao **- DISPUTANT**

And

Boddu Vinosh and others - OPPONENTS

To,

1. Boddu Vinosh, (Opponent No.1) Son of Ananda Kumar, Resident of D.No.69-4-136, Ambedkar Nagar, Patamata, Vijayawada-10.

2. Jaldi Venkateswara Rao (Opponent No.3) Son of Rattaiah, Resident of D.No. 68-4-13, Ambedkar Nagar, Patamata, Vijayawada-10.

3. Inturi Suresh (Opponent No.4), Son of Rosaiah, Resident of D.No.28-109/16, FF-1, Sai Balaji Residency, Sai Nagar, Putta Road, Ramalingeswara Nagar, Vijayawada. **(Opponent No.1,2 and 4)**

Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **27-07-2024** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on **27-07-2024 at 10-30 A.M.** in person, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)

A Prasoon Kumar, Advocate, D.No.27-17-5 Peddibhotla Vari Street Governorpet, Vijayawada-2

Date of Adjourment: 27-07-2024

నూతన శ్రేణి ఏసీలను ప్రవేశపెట్టిన శాంసంగ్ ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్, చిల్డ్ వాటర్ ఇండోర్ కేటగిరీలో కొత్త విండ్-ఫ్రీ ఎయిర్ కండిషనర్‌లను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త శ్రేణిలో విండ్-ఫ్రీ, 360 డిగ్రీ బ్లేడ్‌లెస్ టెక్నాలజీని చిల్డ్ వాటర్ ఆధారిత క్యాసెట్ యూనిట్ల లో కలిగి ఉంది. ఇది వినియోగదారులకు డైరెక్ట్ కోల్డ్ డ్రాఫ్ట్ అసౌకర్యం లేకుండా అత్యుత్తమ కూలింగ్ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడింది. ఈ సందర్భంగా శాంసంగ్ ఇండియా ఎస్ఏసీ బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విపిన్ అగర్వాల్ మాట్లాడుతూ, "చిల్డ్ వాటర్ ఫ్యాన్ కాయిల్ యూనిట్లు నిశ్శబ్దంగా పనిచేస్తున్నప్పుడు వేగవంతమైన వేగంతో ఉన్నతమైన చల్లదనాన్ని అందిస్తాయి. కూలింగ్ యూనిట్లు పెద్ద ప్రదేశాలకు అత్యంత సముచితమైనవి. ఎయిర్‌ఫ్లో సిస్టమ్‌లను మరింత అధునాతనంగా చేస్తూ అందరికీఅందుబాటులోకి వచ్చేందుకే మా ప్రయత్నం" అని అన్నారు.

ఎన్ఐఐటీ యూనివర్సిటీ ఫ్యూచర్-రెడీ కెరీర్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అందుబాటులో పరిమిత సీట్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్ఐఐటీ యూనివర్సిటీలో అత్యాధునిక కెరీర్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని యూనివర్సిటీ వెల్లడించింది. అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ముగియనుంది. రాష్ట్ర కౌన్సెలింగ్‌లో తాము కోరుకున్న విభాగంలో సీటు పొందని దక్షిణ భారతదేశ అభ్యర్థులు తమ ప్రాధాన్య విభాగంలో సీటును పొందే అవకాశం ఉంది. గరిష్టంగా 100 శాతం మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బిటెక్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో బిటెక్, సైబర్ సెక్యూరిటీలో బిటెక్, బయో టెక్నాలజీలో బిటెక్, మూడు సంవత్సరాల బిబిఎ, నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అడ్మిషన్లు తెరవబడతాయి. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌లో బిటెక్ లను కూడా ఎంచుకోవచ్చు.

ఎస్ఆర్జిఇసి స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థిని విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రో రెండవ రోజు సందర్భముగా ప్రముఖ మోటివేటర్, సైకాలజిస్టు డా. విడియాల చక్రవర్తి వ్యక్తిత్వ వికాసము పై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటితరం విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడేతత్వము, నిబద్ధత, నిజాయితీ వంటి గుణాలను కలిగి ముందుకు సాగాలని, కసి మరియు కృషి కలిగి ఉండాలని, బలమైన సంకల్పము ఒక గోల్ మన మెదడులో ఉంచుతారో వారు నేటితరంలో మొదటి స్థానాన్ని సంపాదిస్తారని స్మార్ట్ గోల్స్ కలిగి ముందుకు ప్రణాళిక బద్ధముగా సాగిననాడు మనము అనుకున్నది సాధించగలుగుతామని, మన లక్ష్యాన్ని, మన జీవితాన్ని మంచి మార్గంలో ముందుకు తీసుకుని వెళ్ళగలుగుతామని విద్యార్థులకు తెలియజేసినారు. విద్యార్థి దశలో భయము, బద్ధకము, ముందుగా వదిలి వేయాలని అప్పుడే విద్యార్థికి మంచి జీవితం లభిస్తుందని తెలియజేసినారు. తదుపరి కళాశాల ప్రిన్సిపాల్ డా.బుర్రా కరుణ కుమార్ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమము వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు తెలియజేసినారు. మధ్యాహ్నం 1:30 మరియొక ఉపన్యాసము కళాశాల ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ముత్తి హరికృష్ణ క్యాంపస్ ప్లేస్మెంట్ గురించి మరియు క్యాంపస్ ప్లేస్మెంట్స్ సాధించడానికి కావలసిన నైపుణ్యముల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డా.బి. కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.పి.కోదండ రామారావు, కోఆర్డినేటర్ డా.ఎల్.ఆర్.శ్రీనివాస్, కో కోర్డినేటర్ డా. ఎస్. సురేష్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడా కారులకు సంఘీభావం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరు గ్రామంలో ఎఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు నేడు పారిస్ లో జరగబోయే ఒలింపిక్ క్రీడలలో పాల్గొనబోయే భారత క్రీడాకారులు ఘనవిజయం సాధించాలని భారత్ కు అత్యధిక మెడల్స్ క్రీడాకారులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ "ఆల్ ద బెస్ట్ టూ టీమ్ ఇండియా" అనే కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమములో భాగంగా విద్యార్థిని విద్యార్థులు గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ వద్ద నుండి టార్చ్ ర్యాలీ ని నిర్వహించినారు. దారి పొడుగునా వివిధ విద్యా సంస్థలు, విద్యార్థిని,విద్యార్థులు మానవ హరమును ఏర్పటు చేసి భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ ర్యాలీలో గుడ్లవల్లేరు ఎస్ఐ, ఎంఈఓ, తహశీల్దార్ మరియు వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, పంచాయితీ, గవర్నమెంట్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని టార్చ్ ర్యాలీను జయప్రదము చేసినారు. ఈ టార్చ్ ను ఎస్ఆర్జిఇసి ప్రిన్సిపల్ డా.బి. కరణకుమార్ గారికి అందచేసి కళాశాలలో ఏర్పాటు చేసిన జ్యోతిని ప్రజ్వలింపజేసినారు. తదుపరి కళాశాల ప్రిన్సిపల్ మాట్లడుతూ మన భారతీయ క్రీడకారులు అత్యున్నత క్రీడా నైపుణ్యమును ప్రదర్శించి విజయాలు సాధించాలని వారు మన దేశానికి మంచి పతకాలను సాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.లక్ష్మణరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్. రాజశేఖర్, మత్తి శివశంకర్ ఎస్జిఇసి కళాశాల స్పోర్ట్స్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డా.పి. కోదండ రామారావు, పురప్రముఖులు ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థులు, అధ్యపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

దూర విద్య కోర్సులకు ఇగ్నో దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దూర విద్య కోర్సుల దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ఇంగిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూవర్సిటీ (ఇగ్నో) వర్సిటీ ప్రాంతీయ కేంద్ర సంచాలకుడు డాక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ అన్నారు. గురువారం విజయవాడ ఎస్‌కేపీపీ హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇగ్నో రీజనల్ సెంటర్ విజయవాడ ప్రాంతీయ కేంద్రం జులై 2024 సెషన్‌కు దంఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రాంతీయ కేంద్రం పరిధిలో 15 జిల్లాలో సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ కేంద్రం పరిధిలో 12 అధ్యయన కేంద్రాలు పనిచేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రాంతీయ కేంద్రం పరిధిలో 33 మాస్టర్స్ డిగ్రీ, 24 డిగ్రీ, 46 డిప్లమా, పీజీ డిప్లమా, 60 సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. మొత్తం దాదాపు 180 కోర్సులు అందిస్తున్నామన్నారు. అలాగే నూతనంగా ఏం.ఏ భగవత్ గీత కోర్సు, ఎంబీఏ కన్‌స్ట్రక్షన్ మేనేజ్మెంట్, హెల్త్ కేర్ అండ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజిమెంట్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ ఏం.ఏ అప్లయిడ్ ఊర్దూ కోర్సులను ప్రారంభించామన్నారు. నర్సరీ పిల్లలకు బోధించే పీజీ డిప్లమా ఇన్‌ప్రిప్రైమరీ ఎడ్యుకేషన్ కూడా ప్రారింభించినట్లు తెలిపారు. అలాగే ఎం.ఏ సైకాలజీ, కౌన్సిలింగ్, ఫ్యామిలీ థెరపీ వంటి కోర్సులకు డిమాండ్ ఎక్కువగా ఉందని చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కే.సుమలత, బి.ప్రసాద్‌బాబులు మాట్లాడుతూ ఏడాది నుంచి ప్రాంతీయ కేంద్రం శాశ్వత భవనంలోకి ఆరంగేట్రం చేయబోతుందని తెలియజేశారు. వెంకటయ్య పాలెంలో శాశ్వత భవన నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు.

పోలీస్ శిక్షణాకేంద్ర నిర్మాణం వేగవంతం : ఎస్పీ గంగాధర రావు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : గురువారం జిల్లా ఎస్పీ మరియు పోలీస్ హౌసింగ్ ఇంజనీర్లతో చినకరగ్రహారం నందు గల నూతన పోలీస్ సైట్ ను సందర్శించి పోలీస్ అధికారులకు సూచనలిచ్చారు. పోలీస్ శిక్షణార్థం రాబోవు బ్యాచులకు ఉత్తమ శిక్షణ అందించడానికి త్వరితగతిన నూతన పోలీస్ శిక్షణ కేంద్ర నిర్మాణం జరగాలని, కావలసిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు.నూతనంగా నిర్మించే శిక్షణా కేంద్రాన్ని అన్ని వసతులతో కూడిన భవన నిర్మాణం జరగాలని, సకాలంలో పూర్తి చేయడానికి అందరూ సహకరించాలన్నారు. దాని కొరకు అందరూ సమిష్టిగా కృషిచేయాలన్నారు.

దోమల పెరుగుదల తగ్గించవచ్చు

– రాష్ట్ర ఎడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దోమలను పిల్ల దశలోనే చంపి వేయటం వలన దోమల పెరుగుదల గణనీయంగా తగ్గించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి పేర్కొ న్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, మెదడువాపు, బోదకాలు, చికెన్ గునియా తదితర వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. దోమలను నిర్మూలించడంలో భాగంగా బయోలాజికల్ కంట్రోల్ క్రింద, గంబుషియా అనే చేపలను నీటిలో వదిలిపెడతారని, ఈ చేపలలో సంతానోత్పత్తి రేటు చాలా ఎక్కువగా ఉండటం వలన అవి దోమల లార్వాలను తినేసి దోమలు పెరగకుండా చేస్తాయని వెల్లడించారు. మంగళగిరి సబ్ యూనిట్ పరిధిలోని నీటి నిలువలలో, కోనేరులో ఈ చేప పిల్లలను గురువారం వదిలారు. అనంతరం డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ మాసం మలేరియా నివారణ మాసోత్స వాన్ని జూలై మాసం డెంగ్యూ నివారణ మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి సుబ్బారాయణం, జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వినోద్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ వీర్రాజు, అసిస్టెంట్ కమిషనర్ శ్రీ లక్ష్మీపతి, సహాయ మలేరి యా అధికారి రాజునాయక్, స్టేట్ నుండి సహాయ మలేరియా అధికారి శ్రీ పార్వతీశం, మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్వైజర్లు సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్లు నరసింహారావు, శ్రీనివాసరావు, నరసింహమూర్తి, మంగళగిరి పట్టణంలోని, ఏఎన్ఎంలు ఆశాలు, పాల్గొన్నారు.

మట్టి రోడ్డుగా... తారురోడ్డు

ఇబ్బందులలో ప్రయాణికులు

విశాలాంధ్ర నందిగామ రూరల్ న్యూస్:- చెరుకుంపాలెం నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గాలను కలుపుతూ నందిగామ మండలం చెరుకుంపాలెం నుండి జగ్గయ్యపేట నియోజకవర్గం జగ్గయ్యపేట మండలం బండిపాలెం వరకు వెళ్లే ఒకప్పటి తార రోడ్డు ప్రస్తుతం మట్టి రోడ్డుగా మారిన సంఘటన మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది కనీస మరమ్మత్తులు చేయలేని పరిస్థితుల్లో అప్పటి అధికార యంత్రాంగం పనిచేసింది ఏది ఏమైనప్పటికీ దాని పర్యవసానం ప్రస్తుతం మట్టి రోడ్డుగా ఉన్న ఒకప్పటి తార రోడ్డుగా మనం భావించవలసి వస్తుంది ఇదంతా ఒక ఎత్తు అయితే ప్రస్తుతం వర్షాకాలం నిత్యం జగ్గయ్యపేట వివిధ ప్రాంతాలకు వెళ్లే చందర్లపాడు మండలంలోని ఒక పది గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారంటే అతిశయోక్తి లేదు కనీసం వర్షపు నీరు వల్ల బురద కయ్యగా మారిన రోడ్డును డోజర్ వర్క్ ద్వారా అయినా వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు గానీ రెండు నియోజకవర్గాల ముఖ్య నాయకులు గానీ ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులను గమనించి రోడ్డుకు కనీస మరమ్మత్తులు చేపించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు...

నావాబుపేటలో డ్వాక్రా గ్రూప్ లీడర్ గెలుపు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: మండలంలోని నవాబుపేటలో డ్వాక్రా గ్రూప్ బుక్ కీపర్ ను అధిక గ్రూప్ లీడర్లు తొలగించమని కోరగా గత ప్రభుత్వం లోనిరాకరించరని ,గ్రామం లోని డ్వాక్రా గ్రూప్ లీడర్ లు అందరూ కలసి ఎన్నుకొనుటకు గురువారం సమావేశం ఏర్పాటు చేసుకొని తెలుగుదేశం పార్టీ తరపున కంచర్ల సౌమ్య ను చూచించి సంసిద్ధంచేయగా సమావేశంకు అధిక సంఖ్య గ్రూప్ లీడర్లు హాజరయి. ప్రస్తుత బుక్ కీపర్ (వి ఎం బి కె) రాజీనామా చేయగా.లీడర్లు అందరూ సౌమ్య ను ఎన్నుకున్నారు.ఈ ఘన విజయానికి తోడ్పాటు అందించిన గ్రామ డ్వాక్రా గ్రూప్ లీడర్లకు, గ్రూప్ మహిళలు అందరికీ గ్రామ తెలుగుదేశం పార్టీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

మధుమేహులు కంటి జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ: మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ కళ్ల పట్ల మరింత జాగ్రత్తలు వహించాలని, ఒకవేళ మధుమేహం కలిగినట్లయితే కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నేత్ర వైద్యులు, విజయవాడ రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ ఆదిత్య కపూర్ సూచించారు. ఈ మేరకు విజయవాడ కోడె వెంకటాద్రి చౌదరి ప్రాంగణం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఆదిత్య కపూర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మధుమేహ (డయాబెటిక్స్) వ్యాధి కలిగిన వారిలో 17 శాతం మంది భారతదేశంలోనే ఉన్నారన్నారు. సుమారు 77 మిలియన్ల మంది భారతీయులు మధుమేహం తో బాధపడుతున్నట్లు గుర్తించారని చెప్పారు. డయాబెటిక్ రెటినోపతి " అనేది కళ్ళను ప్రభావితం చేసే ఒక తీవ్రమైన సమస్యగా పేర్కొన్నారు. దీనికి సకాలంలో చికిత్స అందించక పోతే దృష్టిని కోల్పోవచ్చును అన్నారు. చక్కెర స్థాయి రక్తంలో ఎక్కువ కావటం వలన రెటీనా రక్త నాళాలు దెబ్బతినటం వలన కాంతిని గ్రహించే శక్తిని కోల్పోతాయన్నారు. డయాబెటిక్ రెటినోపతి అనేది ఎలాంటి లక్షణాలు కనిపించకుండా వృద్ధి చెందుతుందని, ముందస్తు చికిత్స ద్వారా నివారించ వచ్చునన్నారు. డయాబెటిస్ ఉన్న వారు ప్రతి సంవత్సరం కంటి పరీక్షలు చేయించవలసి ఉంటుందన్నారు. అయితే వ్యాధి తీవ్రతను బట్టి తరచుగా కంటి పరీక్షలు చేయాల్సి ఉంటుందని,గర్భిణీలు మొదటి త్రైమాసికంలో (3వ నెలలో) సమగ్ర నేత్ర పరీక్షలు చేయించుకోవట చాల అవసరం అన్నారు. డయాబెటిక్ రెటినోపతికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ లో ఇంట్రావిట్రియల్ ఇంజెక్షన్లు, లేజర్ ఫోటోకోగ్యులేషన్, అవసరమైతే శస్త్రచికిత్స చేసే వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు.

నాగు మృతదేహానికి బండి రామకృష్ణ నివాళులు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : బందరు మండలం పోలాటితిప్ప గ్రామానికి చెందిన మోకా నాగు వేటకు వెళ్తే గాని పూటగడవని కుటుంబానికి చెందిన వ్యక్తి. బుధవారం అర్ధరాత్రి వేటకు వెళ్లి బోటు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. అతని వయస్సు 45 సం. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన నాగు జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి మోకా రవి సోదరుడు..మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసశ్యులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. జరిగిన సంఘటనను పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్తామని మృతుని కుటుంబానికి అండగా ఉంటామని మృతుని భార్య లక్ష్మీకి ధైర్యం చెప్పి ఓదార్చారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మృతుని బంధువులు, సానుభూతిపరులు, ఎన్డీఏ కూటమి నాయకులు చేరుకుని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు, మాజీ జెడ్పిటీసి లంకె నారాయణ ప్రసాద్, పోలాటితిప్ప సర్పంచ్ మోకా రాజు, పృధ్వీసాయి, జనసేన మరియు టిడిపి నాయకులు, పోలాటితిప్ప గ్రామస్థులు, మత్స్యకార నాయకులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గం లో జనసేన పార్టీ కొత్త సభ్యత్వాల నమోదు కార్య క్రమం జోరుగా సాగుతోంది. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం ఎదుట, కొత్త బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ సెంటర్లలో మూడు సభ్యత్వ నమోదు కార్యక్రమ శిబిరాలను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు శిబిరంలో చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి చేకూరే లబ్ధిని వివరించారు. ఐదు లక్షల ప్రమాద బీమా, శాశ్వత అంగవైకల్యానికి రెండు లక్షలు, స్వల్ప అంగవైకల్యానికి రూ.50 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గొప్ప సిద్ధాంతాలతో పార్టీని స్థాపించి ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ జనసేన పార్టీ అధ్యక్షులు మునగపాటి వెంకటమారుతిరావు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, జొన్నాదుల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి మడుగులో గంబుషియా చేపలు విడుదల

విశాలాంధ్ర-తాడేపల్లి : జూలై నెల డెంగీ నివారణ మాసోత్సవాలు నిర్వహించుటలో భాగంగా డ్రైవర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న దోమల పెంపుదలకు వీలుగా ఉన్న నీటి మడుగులలో దోమల లార్వాలను అంటే దోమల పిల్లలను తినే గంబుషియా అను చేపలను గురువారం అధికారులు విడుదల చేశారు. ఈ చేపలు దోమలు నీటిలో పెట్టిన గుడ్ల నుంచి వచ్చిన దోమల పిల్ల లను తిని వేయడం ద్వారా మనుషులకు మలేరియా డెంగీ, మెదడువాపు, బోద కాలు, చికెన్ గునియా తదితర వ్యాధుల నుంచి కాపాడటం జరుగు తుందని అధికారులు తెలిపారు. ఈ గంబుషియా చేపలు దోమల పిల్లలను తినడం ద్వారా దోమల పెంపుదల ఆగి మానవుల ఆరోగ్యం కాపాడటంలో ఉపయోగం ఉంటుందని తాడేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస తెలిపారు. మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి నేతలు పాలాభిషేకం

విశాలాంధ్ర-తాడేపల్లి : అమరావతి రాజధానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు నిధులు కేటాయించడం, రూ.9151 కోట్లు రైల్వే శాఖకు కేటాయించినం దుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్రానికి నిధులు తీసుకువచ్చిన సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాబి షేకం చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి మొదటి నుంచి అమరావతి రాజధానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అలానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు తంకాసాల ఈశ్వర్ నాయుడు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, బీజేపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ అనుమోలు వంశీకృష్ణ, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ వీఆర్వో మృతి

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి పట్టణం కృష్ణ మందిరం వద్ద గల 12వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో ప్రవీణ్(36) గుడివాడ-మచిలీపట్నం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందారు. ప్రవీణ్ స్వగ్రామం తుళ్లూరు మండలం మందడం. ప్రవీణ్‌కు గత సంవత్సరం మే నెలలో వివాహం జరిగింది. ప్రవీణ్ వీఆర్వోగా భాధ్యతలు నిర్వహిస్తూ ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. ప్రవీణ్ మృతితో కుటుంబ సభ్యులు, తాడేపల్లి సచివాలయ సిబ్బంది విషాదంలో మునిగిపోయారు.

దోమలను నివారించండి

విశాలాంధ్ర-మంగళగిరి : దోమలను నిర్మూలించేం దుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యే శ్వరి అన్నారు. గురువారం మంగళగిరి పట్టణంలోని చిన్న కోనేరులో డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా నీటి నిల్వలో ఉన్న ప్రాంతంలో గంబుషియా చేపలను వదిలారు. రెండు లక్షల చేపలను వదలడం జరిగింది. దీనివలన నీటి నిల్వలో ఉన్న దోమల ఉత్పత్తిని నిర్మిలించడం జరుగుతుందని సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్, స్థానిక మలేరియా యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా మలేరి యా అధికారి సుబ్బ రాయణం, సూపర్‌వైజర్ ఎం.సాగర్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర-మంగళగిరి : మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో మంగళగిరిలో గురువారం కూడా పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. మంగళగిరి ఆల్ఫా సెంటర్ రుచి దాబా వద్ద టిడ్కో క్రాస్, కూరగాయల మార్కెట్ వద్ద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను, చెత్తను, కాలువలో పూడికతీత పనులు క్రేన్ సహాయంతో ఎంటీఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌ను అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పర్యవేక్షించారు.

జిల్లాలో లక్ష క్రియాశీలక సభ్యత్వాలు లక్ష్యం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు జిల్లాలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు లక్షకు పైగా నమోదు కావాలని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పార్టీ శ్రేణు లకు పిలుపునిచ్చారు. జనసేన జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు వెలిదండి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ఆవరణలో సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భ ంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న న్యాయ వాదులు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ లాంటి మహోన్నతమైన వ్యక్తితో కలిసి నడవటం తమకు ఎంతో గర్వ కారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు కొర్రపాటి నాగేశ్వరరావు, మాణిక్యాలరావు, ఆళ్ళ హరి, నారదాసు ప్రసాద్, శిఖ బాలు, మధులాల్ న్యాయ వాదులు సతీష్, చెన్నారావు, సాయి చందు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

27న పొన్నూరు లుంబినివనంలో 'బహిరంగ సభ'

- హాజరుకానున్న కవులు, రచయితలు, సామాజిక విశ్లేషకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దళిత బహుజన ఉద్యమ నేత, మహా కవి డాక్టర్ కత్తి పద్మారావు 71వ జన్మదినాన్ని కుల నిర్మూలన దినంగా పాటిస్తూ ఈ నెల 27, శనివారం ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా పొన్నూరు లుంబిని వనంలో గొప్ప బహిరంగ సభ జరుగునని భీమ్ భారత్ రాష్ట్రఅధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు. దళిత బహుజన మేధావులు, కవులు, రచయితలు, సాహిత్య, సామా జిక విశ్లేషణలో సమకాలిన సమాజానికి మార్గదర్శి. శార్వాక. బౌద్ధ. మహాత్మ పూలే పెరియార్ రామస్వామి నాయకర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలను ముందుకు నడిపే మార్గదర్శకులు పాల్గొంటారన్నారు. ఈ సభలో డాక్టర్ కత్తి పద్మారావు రచించిన గ్రంథాలను ఆవిష్కరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి కుల నిర్మూలన సభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గురువారం స్థానిక భీమ్ భారత్ రాష్ట్ర కార్యాలయంలో బహిరంగ సభకు సంబందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కరపత్ర ఆవిష్కరణలో తాటికొండ నరసింహారావు, సాదు మాల్యాద్రి, డెన్నిస్ రాయ్, శిఖా సురేష్, వేల్పుల నరసింహా రావు, చారువాక, చిన్నం డేవిడ్, ఆర్. సమత తదితరులు ఉన్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్‌లో నిర్వహిం చిన డిగ్రీ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9792 మంది హాజరు కాగా వారిలో 5670 మంది ఉత్తీర్ణత సాధించి నట్లు పేర్కొ న్నారు. అదనపు పరీక్షలు నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు మాట్లాడుతూ డిగ్రీ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.anu.ac.inలో పొందుపరిచి నట్లు పేర్కొ న్నారు. ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఆగస్టు 8వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1240 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అలాగే పర్సనల్ వెరిఫికేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.12 60 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసు కున్న వారు ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా వర్సిటీ డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు.